
# నాగార్జున సాగర్‌లో విద్యుత్ వెలుగులు

**నియోజకవర్గంలో విద్యుత్ వ్యవస్థ బలోపేతానికి చేసిన ఖర్చు రూ. 586.88 కోట్లు**

- ట్రాన్స్‌కో ద్వారా రూ.13.11 కోట్లు..
- టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ ద్వారా రూ.456.68 కోట్లు
- దశాబ్దకాలంలో గణనీయంగా పెరిగిన విద్యుత్ వినియోగదారులు
- 23,419 వ్యవసాయ కనెక్షన్ల కోసం రూ.117.095 కోట్ల వ్యయం
- మెరుగైన విద్యుత్ సరఫరాతో సబ్బండ వర్గాల్లో హర్షం



పెద్దవూర మండలం పర్వేదుల గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్



హాలియా, అక్టోబర్ 4 : సమైక్య రాష్ట్రంలో 40 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో నాగార్జునసాగర్ నియోజకవర్గంలో విద్యుత్ చీకట్లు అలుముకున్నాయి. స్వరాష్ట్రంలో అవన్నీ ఒక్కొక్కటిగా పరిష్కారమయ్యాయి. నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం గత తొమ్మిదేండ్ల కాలంలో రూ.586.88 కోట్లు ఖర్చు చేసింది. కాంగ్రెస్ హయాంలో రోజులో 8 గంటలు కూడా కరెంట్ సక్రమంగా ఉండేది కాదు. వ్యవసాయానికి ఉదయం 3 గంటలు, రాత్రి నాలుగు గంటలు ఇచ్చేవారు. ఇక పరిశ్రమలకు విద్యుత్ సరఫరా గురించి చెప్పాల్సిన పనే లేదు. ఏనాడూ పరిశ్రమలకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేసిన దాఖలాలు లేవు. వారంలో ఒకరోజు పవర్ హాలిడే ప్రకటించిన సందర్భాలు ఉన్నాయి. కానీ, 2014లో స్వరాష్ట్రం సాధించుకున్న తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవడంతోపాటు నేడు వ్యవసాయంతో పాటు గృహ, పారిశ్రామిక అవసరాలకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నారు. నాటి కాంగ్రెస్ పాలనలో రోజులో 24 గంటలు కరెంట్ ఉంటే వార్త.. నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో 24 గంటల్లో ఒక్కగంట కరెంట్ పోతే వార్త అన్న చందంగా పరిస్థితి మారింది. స్వరాష్ట్రంలో 24 గంటల కరెంట్ సరఫరాతో ఇటు రైతాంగం, అటు వ్యాపారులు, పారిశ్రామిక వర్గాల ప్రజలు ఆనందంగా ఉన్నారు.

### టీఎస్ఎస్‌పీడీసీఎల్ ద్వారా..

| | కాంగ్రెస్ (40 ఏండ్లలో) | బీఆర్‌ఎస్ (9 ఏండ్లలో) | మొత్తం | చేసిన ఖర్చు |
|---|---|---|---|---|
| 33/11 కేవీ సబ్‌స్టేషన్లు | 23 | 8 | 31 | 9.07 కోట్లు |
| 33 కేవీ లైన్లు | 105.6 | 164.95 | 270.55 | 13.9 కోట్లు |
| 11 కేవీ లైన్లు | 1053.5 | 2,041.49 | 3,094.99 | 86.04 కోట్లు |
| ఎల్ టీ లైన్లు | 3,213.3 | 2,683.35 | 5,896.65 | 93.35 కోట్లు |
| పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు | 23 | 15 | 38 | 9.7 కోట్లు |
| డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు | 6,825 | 8,133 | 14,958 | 93.29 కోట్లు |
| ఇతర పనులు | - | - | - | 151.15 కోట్లు |
| మొత్తం | | | | 456.68 కోట్లు |

### రూ.586.88 కోట్లతో విద్యుత్ వ్యవస్థ మెరుగు..

నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గడిచిన తొమ్మిదేండ్లలో రూ.586.88 కోట్లు ఖర్చు చేసింది. అందులో రూ.23 కోట్లతో అనుముల మండలం రామడుగు, హజారిగూడెం, తిరుమలగిరి(సాగర్) మండలంలోని అల్వాల, తిరుమలగిరి, త్రిపురారం మండలంలోని నీలాయగూడెం, పెద్దదేవులపల్లి, పెద్దవూర మండలంలోని పొట్టిచెలిమ, పర్వేదుల, కొత్తలూరు, నిడమనూరు మండలంలోని ఎర్రబెల్లి గ్రామాల్లో మొత్తం 10 విద్యుత్ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేసింది. వీటిలో ఒకటి 220 కేవీ, మరొకటి 132 కేవీ కాగా, మిగతా ఎనిమిది 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. రూ.9.7 కోట్లతో 15 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, రూ.93.29 కోట్లతో 8,133 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, రూ.13.9 కోట్లతో 164.95 కిలోమీటర్ల మేర 33 కేవీ లైన్లు, రూ.86.04 కోట్లతో 11కేవీ లైన్లు, రూ.93.35 కోట్లతో ఎల్‌టీ లైన్లు, రూ.151.15 కోట్లతో ఇతర పనులు చేయడం జరిగింది. అదే విధంగా నియోజకవర్గంలో 23,419 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం రూ.117.095 కోట్లు వెచ్చించారు.

### 1,28,170కి చేరిన విద్యుత్ కనెక్షన్లు

నియోజకవర్గంలో గత దశాబ్దకాలంలో నూతన విద్యుత్ కనెక్షన్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 75,649 మంది విద్యుత్ వినియోగదారులు ఉండగా, నేడు ఆ సంఖ్య 1,28,170 మందికి చేరింది. అంటే కొత్తగా 50 వేల విద్యుత్ కనెక్షన్లు పెరిగాయి. ప్రస్తుతం నియోజకవర్గంలో 70,891 మంది గృహ వినియోగదారులు, 8,318 కమర్షియల్ వినియోగదారులు, 474 పారిశ్రామిక వినియోగదారులు, 87 హెచ్‌టీ వినియోగదారులు, 2,189 ఇతర కేటగిరీల వినియోగదారులు ఉన్నారు.

### లోఓల్టేజీ సమస్యకు చెక్..

కాంగ్రెస్ పాలనలో వ్యవసాయం దండుగ అన్న రైతులే నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో వ్యవసాయం పండుగ అంటున్నారు. కాంగ్రెస్ పాలనలో నియోజకవర్గంలో ఏ మండలంలో, ఏ గ్రామంలో చూసినా విద్యుత్ లోఓల్టేజీ సమస్య ఉండేది. సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువగా ఉండి మోటర్ కనెక్షన్లు ఎక్కువగా ఉండడంతో లోఓల్టేజీతో తరచూ ట్రాన్స్‌ఫార్మర్లు, రైతుల మోటర్లు కాలిపోయేవి. పొలాలు ఎండిపోయేవి. ఏడాదిలో రెండు, మూడుసార్లు ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లు కాలిపోవడంతో రైతులు వాటి రిపేర్ల కోసం వేల డబ్బులు ఖర్చు చేయాల్సి వచ్చేది. వ్యవసాయానికి పగలు 3 గంటలు, రాత్రి 4 గంటల కరెంట్‌తో రైతులు వ్యవసాయ సేద్యానికి ఇబ్బందిపడేవాళ్లు. ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్‌కు 3 నుంచి 5 రోజుల సమయం పట్టడంతో పొలాలు నెర్రెలు బారేవి. కానీ, నేడు బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నియోజకవర్గంలో అవసరమైన చోట నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణంతో లోఓల్టేజీ సమస్యకు చెక్ పడింది. దీనికి తోడు ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేయడంతో రైతులు ఆనందంగా వ్యవసాయం సాగు చేస్తున్నారు.

### టీఎస్ ట్రాన్స్‌కో ద్వారా విద్యుత్ సరఫరా..

| విద్యుత్ సబ్‌స్టేషన్ల సంఖ్య | కాంగ్రెస్ (40 ఏండ్లలో) | బీఆర్‌ఎస్ (9 ఏండ్లలో) | మొత్తం |
|---|---|---|---|
| 220 కేవీ సబ్‌స్టేషన్లు | 1 | 1 | 2 |
| 132 కేవీ సబ్‌స్టేషన్లు | 1 | 1 | 2 |
| పవర్‌ట్రాన్స్‌ఫార్మర్లు | 2 | 4 | 6 |

బీఆర్‌ఎస్ పాలనలో చేసిన ఖర్చు రూ.13.11కోట్లు

### విద్యుత్ వినియోగదారుల సంఖ్య

| వినియోగదారుల సంఖ్య | కాంగ్రెస్ | బీఆర్‌ఎస్ |
|---|---|---|
| గృహ వినియోగదారులు | 47,739 | 70,891 |
| కమర్షియల్ వినియోగదారులు | 3,743 | 8,318 |
| వ్యవసాయ వినియోగదారులు | 22,792 | 46,211 |
| పారిశ్రామిక వినియోగదారులు | 392 | 474 |
| హెచ్‌టీ వినియోగదారులు | 67 | 87 |
| ఇతర వినియోగదారులు | 916 | 2,189 |
| మొత్తం వినియోగదారులు | 75,649 | 1,28,170 |

### గతంలో కరెంట్ కష్టాలు చెప్పనలవి కావు



కాంగ్రెస్ పాలనలో కరెంట్ కష్టాలు చెప్పనలవి కావు. అలాంటి పాలన మళ్లీ జీవితంలో రావద్దని కోరుకుంటున్నా. కాంగ్రెస్ పాలనలో గృహ, పారిశ్రామిక, వ్యవసాయ అవసరాలకు ఏనాడూ కరెంట్ సమక్రంగా ఇచ్చిన దాఖలాలు లేవు. పగటిపూట కరెంట్ లేక ఉడకపోతతో ఇంట్లో ఉండలేని పరిస్థితి. రాత్రి పూట కరెంట్ కోసం పొలం దగ్గర జాగారం చేసేవాళ్లం. ఏ రోజు కూడా సక్రమంగా కరెంట్ వచ్చిన దాఖలాలు లేవు.

–వెంకట్రామిరెడ్డి, రైతు, రామడుగు

### 24గంటల కరెంట్‌తో చేతినిండా పని



ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారంలోకి వచ్చాక 24 గంటల కరెంటుతో వడ్రంగులమంతా ఆనందంగా జీవిస్తున్నాం. గతంలో కాంగ్రెస్ పాలనలో కరెంటు సక్రమంగా ఉండేది కాదు. ఎప్పుడు వస్తదో, ఎప్పుడు పోతదో తెలియని పరిస్థితి ఉండేది. నాడు పని లేక పస్తులుండే పరిస్థితి. కానీ, నేడు ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇవ్వడం మూలంగా చేతి నిండా పని ఉంది. పనికి తగ్గ ఆదాయం కూడా వస్తుంది. భార్యాబిడ్డలతో ఆనందంగా జీవిస్తున్నాం.

–బ్రహ్మచారి, వడ్రంగి, హాలియా

### కరెంటు సమస్యలన్నీ పరిష్కరించాం



దార్శనికత కలిగిన ఉద్యమ నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్. ఆయన బాధ్యతలు చేపట్టిన తరువాత రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో 40 ఏండ్లుగా అలుముకున్న విద్యుత్ చీకట్లను పారదోలారు. గడిచిన తొమ్మిదేండ్లలో నాగార్జునసాగర్ నియోజకవర్గంలో రూ.586.85 కోట్లు ఖర్చు చేసి ఈ ప్రాంతంలో ఉన్న విద్యుత్ సమస్యలన్నింటినీ పరిష్కరించడం జరిగింది. వ్యవసాయంతోపాటు గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగానికి 24 గంటలపాటు విద్యుత్ సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రంలో దేశంలో ఒక్క తెలంగాణ మాత్రమే.

–నోముల భగత్‌కుమార్, ఎమ్మెల్యే



తుంగతుర్తిలో తుది దశలో మార్కెట్ కార్యాలయ భవనం

# తుంగతుర్తికి మరో 2 మార్కెట్లు

## నియోజకవర్గ రైతుల కోసం కొత్తగా నిర్మించిన ప్రభుత్వం

- కాళేశ్వరం జలాల రాకతో పెరిగిన పంటల ఉత్పత్తి
- రైతులకు తగ్గనున్న దూరభారం

తిరుమలగిరి, అక్టోబర్ 4 : 2014కు ముందు నియోజకవర్గంలోని తిరుమలగిరిలో ఒక్కటే వ్యవసాయ మార్కెట్ ఉండేది. రైతులు తమ పంటలను విక్రయించాలంటే తిరుమలగిరి లేదా సూర్యాపేట జిల్లా కేంద్రానికి తీసుకెళ్లాల్సిన పరిస్థితి. దాంతో రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకపోవడం, సుదూర ప్రాంతాలకు వెళ్లి విక్రయించాల్సి ఉండడంతో ఆర్థిక భారంతో అప్పులు తప్ప.. పైసా మిగిలేది కాదు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో అదనంగా రెండు వ్యవసాయ మార్కెట్లు ఏర్పాటు చేస్తుండడంతో త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి.

### తుంగతుర్తిలో వ్యవసాయ మార్కెట్..

తుంగతుర్తి మండల కేంద్రంలో 7ఎకరాల 35 గుంటల విస్తీర్ణంలో సుమారు రూ.3 కోట్లతో నూతన వ్యవసాయ మార్కెట్ అన్ని సౌకర్యాలతో నిర్మితమవుతుంది. సుమారు రూ.20 లక్షలతో మార్కెట్ కార్యాలయం నిర్మించారు. రూ.30 లక్షలతో ప్రహరీ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ మార్కెట్ అందుబాటులోని వస్తే నూతనకల్, మద్దిరాల మండల రైతులకు దూరభారం తగ్గి వారు పండించిన పంటకు గిట్టుబాటు ధర రానున్నది.

### జాజిరెడ్డిగూడంలో సబ్ మార్కెట్..

జాజిరెడ్డిగూడెం శివారులో రూ.1.55 కోట్లతో నూతనంగా వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డు ఏర్పాటు జరుగుతుంది. దీని పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. ఈ మార్కెట్ యార్డుకు నీటిరంగ నిపుణులు దివంగత విద్యాసాగర్‌రావు పేరును ఖరారు చేస్తూ ప్రభుత్వం గతంలోనే ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాసాగర్‌రావు స్వగ్రామం జాజిరెడ్డిగూడెం కావడంతో ఈ సబ్ మార్కెట్ యార్డుకు ఆయన పేరు పెట్టారు. ఈ సబ్ మార్కెట్ యార్డుతో జాజిరెడ్డిగూడెం మండలంతోపాటు నాగారం మండల ప్రజలకు దూరభారం తగ్గనున్నది. దాంతో ఇక్కడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


### తిరుమలగిరి మార్కెట్‌ది దశాబ్దాల చరిత్ర

తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు దశాబ్దాల చరిత్ర ఉంది. ఇక్కడి రైతులు తమ పంట ఉత్పత్తులను నిజాం సర్కారు సమయంలోనే గుర్తించడం జరిగింది. అప్పట్లోనే పంటల క్రయ విక్రయాలు ఇక్కడ నిర్వహించేవారు. తొమ్మిది ఎకరాల 39 గుంటల విస్తీర్ణం కలిగిన ఈ మార్కెట్ అధికారికంగా 1993లో ఏర్పాటైంది. మొదటగా ధాన్యం, పప్పుధాన్యాల క్రయవిక్రయాలతో ప్రారంభం కాగా, నేడు సంప్రదాయ, వాణిజ్య పంటల ఉత్పత్తుల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. 2016లో జిల్లాలోనే మొట్టమొదటి ఈనామ్ మార్కెట్‌గా గుర్తింపు పొందింది.



తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం రాశులు (ఫైల్)

### రైతులకు దూరభారం తగ్గుతుంది



నియోజకవర్గంలో మార్కెట్ యార్డుల ఏర్పాటుతో రైతులకు దూరభారం తగ్గనున్నది. గతంలో రైతులు పండించిన పంట అమ్ముకోవాలంటే సూర్యాపేట, తిరుమలగిరి మార్కెట్లకు వెళ్లలేక వ్యాపారులు, దళారులకు ధాన్యం అమ్ముకోవాల్సి వచ్చేది. తెలంగాణ ప్రభుత్వంలో మంత్రి జగదీశ్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ తుంగతుర్తిలో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేయించడం హర్షణీయం.

–రామసాయం జనార్దన్‌రెడ్డి, బిక్కుమళ్ల, నూతనకల్

### దళారుల బెడద తొలగనున్నది



వ్యవసాయ మార్కెట్లు అందుబాటులోకి రానుండడంతో రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కనున్నది. దళారుల బెడద తొలగనున్నది. ఆర్థిక భారంతోపాటు దూరభారం తగ్గనున్నది. సకాలంలో పంటను విక్రయించుకునే అవకాశం ఉంటుంది. నూతనంగా ఏర్పాటు చేసే మార్కెట్లతో రైతులకు అన్నివిధాలా ఉపయోగకరం.

–వెలుగు సునీల్, రైతు, కర్విరాల, తుంగతుర్తి

# అల్లరి

ALLARI

### చెప్పుకోండి



1. కొలతలను ప్రవేశపెట్టింది ఎవరు?
2. దేశంలో అత్యధిక జాతీయ పార్కులు (9) ఉన్న రాష్ట్రం?
3. కాలేయం స్రవించే రసం పేరు ఏమిటి?

### పదసృష్టి




**కింది** పదంలోని అక్షరాల సాయంతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

Everyone

Ex : One

### మంచి మాట



**విజయం** కలిగిందని విర్రవీగకు. అపజయం కలిగిందని నిరాశపడకు. విజయమే అంతం కాదు. అపజయమే తుదిమెట్టు కాదు.


• స్వామి వివేకానంద

### కథ

## కృషితో నాస్తి దుర్భిక్షం

**సిరిమల్లిపేట** గ్రామంలో సిరపయ్య అనే శ్రామికుడు ఉండేవాడు. ఆ ఊరివారి బట్టలన్నీ తానే ఉతికేవాడు. అతని కొడుకు రాములు. ఆ ఊరి బడిలోనే ఐదో తరగతి చదివేవాడు. రాములు ప్రతిరోజూ ఉదయాన్నే ఇంటింటికీ తిరిగి బట్టలు తెచ్చేవాడు. ఒకరోజు ఆ ఊరిపెద్ద.. ''ఒరేయ్ రాములు! ఇక నువ్వు చదువు మానేసి, మీ నాన్నకు సహాయం చేయరా! బట్టలుతికి బతకరా!'' అని సలహా ఇచ్చాడు. దానికి రాములు.. ''లేదు దొరా! నేను ఇంకా చదివి కలెక్టర్ అవుతా!'' అన్నాడు. అది విన్న ఊరిపెద్ద నవ్వి.. ''మరి నీ చదువుకోసం పైసలు ఎక్కడి నుంచి వస్తాయిరా!?'' అని రెట్టించి అడిగాడు. ''బట్టలు ఉతుకుతూ.. దొరికిన పని చేసుకుంటూ సదువుకుంట దొరా!'' అని సమాధానం చెప్పాడు రాములు. ఆ పల్లెటూరి పిల్లగాడు.. పశువులు మేపాడు. బట్టలు ఉతికాడు. కష్టపడి సంపాదించిన డబ్బుతో పుస్తకాలు కొనుక్కొని బుద్ధిగా చదువుకున్నాడు. ''ఈ చదువులు మనకు వద్దురా! కులవృత్తి చేసుకోరా!'' అని తండ్రి ఒత్తిడి తెచ్చాడు. కొడుకు తన మాట వినడంలేదని ఊరిపెద్దకు ఫిర్యాదు కూడా చేశాడు. ఊరిపెద్ద రాములును పిలిపించి.. ''కాళ్లు ఇరగ్గొడతా! సదువు లేదు. గిదువు లేదు.. బట్టలు ఉతికి బతుకు!' అని హెచ్చరించాడు. దాంతో.. ఊళ్లో ఉంటే చదువుకోవడం సాధ్యం కాదని ఇంటినుంచి పారిపోయాడు రాములు. హాస్టల్లో చేరి.. మంచి మార్కులతో పది పాసయ్యాడు. ఇంటర్మీడియట్‌లో జిల్లాలోనే మొదటి ర్యాంకు సాధించాడు. ట్యూషన్లు చెబుతూ.. ఇంజినీరింగ్ పూర్తిచేశాడు. ఆ తర్వాత అధ్యాపకులు, కలెక్టర్ చొరవతో అమెరికాలోని యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేశాడు. అక్కడి యాజమాన్యం రాములు ప్రతిభను చూసి.. అధ్యాపకునిగా నియమించింది. మూడేళ్లకే అత్యంత ప్రతిభావంతుడైన అధ్యాపకుడిగా పురస్కారం దక్కించుకున్నాడు రాములు. శ్వేతసౌధంలో.. అమెరికా అధ్యక్షుడి చేతులమీదుగా పురస్కారం అందుకున్నాడు. అందుకే పిల్లలూ.. 'కృషితో నాస్తి దుర్భిక్షం!' అంటారు. కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదు.

• బల్ల కృష్ణవేణి



### ఆ పదమేంటి?




ఇచ్చిన అక్షరాలను ఒకే గడిలో సరైన పదాన్ని కనుక్కోండి.

N O C R



### తేడాలు కనిపెట్టండి

ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు చిత్రాల్లో 6 తేడాలున్నాయి. అవేంటో గుర్తించండి.



### చిటర్ ఫ్రెండ్స్



ఎస్. లాస్య, రాయలపూర్



పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం. మా చిరునామా: zindagi@ntnews.com